సాక్షి జగిత్యాల

బుధవారం । 21 । జూన్ । 2023



వైభవంగా రథయాత్ర

మెట్‌పల్లి : కృష్ణచైతన్య సంఘం ఆధ్వర్యంలో మంగళవారం శ్రీజగన్నాథ రథయాత్ర మహోత్సవం వైభవంగా నిర్వహించారు.



కొండపై భక్తుల రద్దీ

కొండగట్టు : కొండగట్టు శ్రీఆంజనేయస్వామి సన్నిధిలో ఆషాఢమాసం ప్రారంభంలోనూ భక్తుల రద్దీ కొనసాగింది.

గరిష్టం/కనిష్టం
40.0/29.0

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. పగటిపూట ఎండగా ఉంటుంది. వడగాలులు వీచే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ఆధ్యాత్మిక వేడుకలకు నృసింహుని ముస్తాబు



ముస్తాబైన నృసింహస్వామి ఆలయం

ధర్మపురి: తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా బుధవారం చేపట్టే ఆధ్యాత్మిక వేడుకలకు ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయం ముస్తాబైంది. ఈవో శ్రీనివాస్ ఆధ్వర్యంలో తొలుత ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. ఈసందర్భంగా రాజగోపురాలకు విద్యుత్ దీపాలు అలంకరించారు. ప్రత్యేక పూలదండలు సిద్ధం చేశారు. బుధవారం ఉదయం నుంచి రాత్రి వరకూ ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తారు. ప్రధానంగా ఉదయం 9 గంటలకు ఆలయ ప్రాంగణంలో సుమారు 300 మందితో సామూహిక సత్యనారాయణ వ్రత కార్యక్రమాలు నిర్వహిస్తారు. ధూపదీప నైవేద్య పథకం కింద ఎంపికైన నియోజకవర్గంలోని 24 ఆలయాల అర్చకులకు మంత్రి కొప్పుల ఈశ్వర్ ప్రొసీడింగులు అందజేస్తారు.

గడపగడపకూ పథకాలు



మాట్లాడుతున్న భోగ శ్రావణి

రాయికల్(జగిత్యాల): కేంద్రప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను గడపగడపకూ తీసుకెళ్లాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు భోగ శ్రావణి కోరారు. మహాజన్ సంపర్క్ అభియాన్‌లో భాగంగా పట్టణంలో మంగళవారం జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆమె మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరిస్తూ ప్రధాని నరేంద్ర మోదీ చేస్తున్న అభివృద్ధి గురించి వివరించాలన్నారు. పార్టీ పటిష్టత కోసం కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని కోరారు. బీజేపీ పట్టణ అధ్యక్షుడు కల్లెడ ధర్మపురి, మండల అధ్యక్షుడు అన్నవేని వేణు, కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మంగళారపు లక్ష్మీనారాయణ, జిల్లా ప్రధాన కార్యదర్శి ఏనుగు ముత్యంరెడ్డి, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు సురతాని భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

చదువుతోనే అభివృద్ధి

జగిత్యాల: చదువుతోనే అభివృద్ధి సాధ్యమని స్థానిక ఎస్‌కేఎన్‌ఆర్ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సత్యనారాయణ అన్నారు. విద్యా దినోత్సవం సందర్భంగా స్థానిక మహిళా డిగ్రీ కళాశాలలో వేడుకలు నిర్వహించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ, కేజీ టూ పీజీ విద్యలో భాగంగా యూనివర్సిటీ స్థాయి వరకు ప్రభుత్వం నాణ్యమైన విద్య అందిస్తోందన్నారు. విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. అనంతరం జిల్లాస్థాయిలో ఉత్తమ అధ్యాపక అవార్డు పొందిన హర్జోత్‌కౌర్, పడాల తిరుపతిని అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రతినిధులు జ్యోతిలక్ష్మి, సత్యప్రకాశ్, చంద్రయ్య, స్వరూపరాణి పాల్గొన్నారు.

కొత్తదాంరాజుపల్లిలో హైనా సంచారం



చెరుకుతోటలో కాలిముద్ర

మల్లాపూర్(కోరుట్ల): కొత్త దాంరాజుపల్లి శివారులో అడవి జంతువు హైనా సంచరించినట్లు ప్రచారం జరగడం కలకలం సృష్టించింది. గ్రామానికి చెందిన రైతు కాటిపెల్లి ఆదిరెడ్డి గ్రామ శివారులోని తన చెరుకుతోటకు నీరు పెట్టేందుకు మంగళవారం వెళ్లాడు. అక్కడ అడవిజంతువు కాలిముద్రలు కనిపించాయి. ఈవిషయాన్ని గ్రామస్తులు, అటవీ అధికారులకు తెలియజేశాడు. ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ సత్తార్ చెరుకుతోటకు చేరుకుని విచారణ చేపట్టారు. కాలిముద్రలను బట్టి సోమవారం రాత్రి హైనా సంచరించిందని నిర్ధారణకు వచ్చారు. ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల్లోని అటవీప్రాంతాల నుంచి గోదావరి నదిని దాటి జగిత్యాల జిల్లాలోని అటవీ ప్రాంతానికి చేరుకున్నట్లు ఆయన అంచనా వేశారు. రాత్రి వేళ్లల్లో ప్రయాణించే ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డీఎఫ్‌వో వెంకటేశ్వర్‌రావు సూచించారు.

ఉత్తమ విద్యార్థిగా ఎంపిక



బానోవత్ సురేశ్

రాయికల్(జగిత్యాల): తెలంగాణ దశాబ్ది ఉత్సవాల విద్యా దినోత్సవం సందర్భంగా దావనపల్లి గ్రామానికి చెందిన బానోవత్ సురేశ్ ఉత్తమ విద్యార్థిగా ఎంపికయ్యారు. యూనివర్సిటీలో ఎంఎస్సీ వృక్షశాస్త్ర విభాగానికి చెందిన సురేశ్‌ను శాతవాహన యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్.. ఉత్తమ విద్యార్థిగా ఎంపిక చేశారు. ప్రొఫెసర్లు సురేశ్‌ను అభినందించారు.

వరదకాలువ లూటీ



ఇది మెట్‌పల్లి మండలం రాంలచ్చక్కపేట వరద కాలువ. అక్రమార్కులు జేసీబీ సాయంతో ఇందులోంచి ఇసుక తోడేస్తున్నారు. రోజూ వందలాది ట్రాక్టర్లలో ఇతర ప్రాంతాలకు తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఇదంతా బహిరంగంగా జరుగుతున్నా ఎస్సారెస్పీ, జిల్లా అధికారులు అటువైపు కన్నెత్తి చూడడంలేదు. అధికార పార్టీకి చెందిన ఓ మండలస్థాయి ప్రజాప్రతినిధి అండ ఉండడంతోనే వారు మిన్నకుండిపోతున్నారనే ప్రచారం జరుగుతోంది.

> **రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు**
>
> వరదకాలువ నుంచి ఇసుక తరలిస్తున్న విషయాన్ని రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. వారు తదుపరి చర్యలు తీసుకోవాల్సి ఉంది. కట్ట నుంచి మట్టి, బండరాళ్లను తరలించకుండా సిబ్బందిని నియమించి పర్యవేక్షిస్తున్నాం. అనుమతి తీసుకోకుండా మట్టి తరలిస్తే ఉపేక్షించేదిలేదు.
>
> – వెంకటేశ్వర్‌రావు, ఈఈ, ఎస్సారెస్పీ

- కట్ట నుంచి యథేచ్ఛగా మట్టి తరలింపు
- రాళ్లు, ఇసుకనూ కొల్లగొడుతున్న అక్రమార్కులు
- నిబంధనలకు విరుద్ధంగా వీడీసీల వేలం పాటలు
- ప్రజాప్రతినిధుల అండతో చెలరేగిపోతున్న వైనం
- నిస్సహాయత వ్యక్తంచేస్తున్న అధికార యంత్రాంగం

మెట్‌పల్లి(కోరుట్ల): జిల్లాలోని ఆయకట్టుకు సాగునీరు అందించడానికి వరదకాలువ నిర్మించారు. కొందరు అక్రమార్కులకు ఇది వరంగా మారింది. అందులోంచి ఇసుకతోపాటు ఇరువైపులా మట్టి, రాళ్లను అక్రమంగా తరలిస్తూ అమ్ముకుంటున్నారు. మరోవైపు.. కొందరు కాలువ భూములు చదును చేసి పంటలు పండిస్తున్నారు. మరికొన్నిచోట్ల కబ్జా చేసి కట్టడాలు నిర్మిస్తున్నారు. అధికారుల నిర్లక్ష్యంతో ఎస్సారెస్పీ కాలువ భూములు ఇప్పటికే కబ్జా కోరల్లోకి వెళ్లాయి. ఒక్క మెట్‌పల్లి పట్టణంలోనే ఆ శాఖ భూముల్లో ఇలా అనేక కాలనీలు వెలిశాయి. కేవలం అధికారుల నిర్లక్ష్యం, పర్యవేక్షణ లోపంతోనే వరదకాలువ భూములు, వనరులు లూటీ అవుతున్నాయనే విమర్శలు ఉన్నాయి. అయినా, అధికారులు స్పందించకపోవడం శోచనీయం.



'ఇది మెట్‌పల్లి మండలం సత్తెక్కపల్లి గ్రామ శివారులోని వరదకాలువ కట్ట. కాలువకు గండ్లు పడితే సమీప గ్రామాలకు వరద ముప్పు వాటిల్లకుండా ఇరువైపులా మట్టితో కట్టలు పోశారు. అక్రమార్కులు ఈ మట్టితోపాటు బండరాళ్లు తరలిస్తూ అమ్ముకుంటున్నారు. ఫలితంగా కట్ట ఆనవాళ్లు కోల్పోతోంది. సమీప గ్రామాలకూ వరద ముప్పు పొంచిఉంది.

జిల్లాలో వరద కాలువ పొడవు 58 కి.మీ.

- శ్రీరాంసాగర్ ప్రాజెక్టు రెండోదశ విస్తరణలో భాగంగా గతంలో వరద కాలువ నిర్మించారు.
- ప్రాజెక్టు మిగులు జలాలను సద్వినియోగం చేసుకునేందుకు దీని నిర్మాణం చేపట్టారు.
- ప్రాజెక్టు నుంచి ఈ కాలువ సుమారు 130 కి.మీ. పొడవున విస్తరించి ఉంది.
- జగిత్యాల జిల్లాలో 28 కి.మీ. వద్ద ప్రారంభమై 86 కి.మీ. వద్ద ముగుస్తుంది. అంటే 58 కి.మీ. పొడవున విస్తరించి ఉంది.

- కోరుట్ల, జగిత్యాల, ధర్మపురి, వేములవాడ నియోజవర్గాల్లో కాలువ పారకం ఉంది. దీని కింద వేలాది ఎకరాల ఆయకట్టు ఉంది.

కొరవడిన పర్యవేక్షణ

- కాలువ రక్షణ విషయంలో అధికారుల పర్యవేక్షణ పూర్తిగా కొరవడిందనే విమర్శలు వినిపిస్తున్నాయి. దీంతోనే కాలువ వనరులు లూటీ అవుతున్నాయి. ఇరువైపులా ఉన్న కట్టను తవ్వి మట్టి, బండరాళ్లు, కాలువలోని ఇసుక తరలిస్తూ సొమ్ముచేసుకుంటున్నారు. విచిత్రమేమిటంటే.. కాలువలో ఇసుక విక్రయాలకు మెట్‌పల్లి మండలంలోని ఓ వీడీసీ ఏకంగా వేలం పాటలు నిర్వహించింది. ఆ గ్రామానికి చెందిన కొందరు అత్యధికంగా రూ.39లక్షలకు పాట పాడి ఇసుక తరలింపు హక్కులు దక్కించుకోవడం గమనార్హం. వారు కొన్నిరోజులుగా పట్టపగలే కాలువ లోంచి ఇసుక తరలిస్తూ ఒక్కో ట్రాక్టర్‌కు రూ.1,500 చొప్పున వసూలు చేస్తున్నారు. దీనిని అరికట్టాల్సిన అధికారులే.. తెర వెనుక సహకారం అందిస్తున్నారనే విమర్శలున్నాయి. ఇసుక తరలింపునకు అనుకూలంగా ఆ ప్రాంతంలోకి నీరు చేరకుండా గేట్లను వేశారని తెలిసింది.

గ్రామాల మధ్య వివాదాలు

- కాలువ భూముల్లో అక్రమ నిర్మాణాలు చేపట్టడం, అందులోంచి ఇసుక తరలించడం వంటి వ్యవహారాలు గ్రామాల మధ్య వివాదాలకు దారి తీస్తున్నాయి.
- మెట్‌పల్లి మండలం జగ్గాసాగర్ గ్రామస్తులు సోమవారం జాతీయ రహదారిపై ఆందోళనకు దిగడం దీనికి నిదర్శనంగా నిలుస్తోంది.
- రాంలచ్చక్కపేట గ్రామస్తులు కాలువ భూముల్లో అక్రమంగా కట్టడాలు నిర్మించారని, ఇసుక అమ్ముకుంటున్నారని ఆరోపిస్తూ రాస్తారోకో చేసి నిరసన తెలిపారు.

విలువలతో కూడి విద్య అవసరం



కల్వకోటలో అభివృద్ధి చేసిన బడిని ప్రారంభిస్తున్న కలెక్టర్ యాస్మిన్‌బాషా, పక్కన ఎమ్మెల్యే రమేశ్

- కలెక్టర్ యాస్మిన్ బాషా
- కల్వకోటలో విద్యా దినోత్సవం

కథలాపూర్(వేములవాడ): పాఠశాలల అభివృద్ధికి ప్రభుత్వం అన్నివిధాలా సహకరిస్తుందని, విద్యార్థులకు విలువలతో కూడిన విద్య అవసరమని కలెక్టర్ యాస్మిన్ బాషా అన్నారు. మేడిపెల్లి మండలం కల్వకోట ప్రభుత్వ పాఠశాలలో మంగళవారం విద్యా దినోత్సవం నిర్వహించారు. ఇందులో భాగంగా 'మన ఊరు– మన బడి' కింద రూ.13.34 లక్షల వ్యయంతో మౌలిక వసతులు సమకూర్చిన బడిని ప్రారంభించారు. వేములవాడ ఎమ్మెల్యే రమేశ్‌బాబు, జెడ్పీ చైర్‌పర్సన్ వసంత హాజరయ్యారు. తొలుత విద్యార్థులకు నోట్‌బుక్కులు, పాఠ్యపుస్తకాలు, రాగి జావ పంపిణీ చేశారు. అంతకుముందు కొండాపూర్‌లో మొక్కలు నాటారు. కల్వకోట, మన్నెగూడెంలో కొత్త గ్రామపంచాయతీ భవనాలు, దమ్మన్నపేటలో ఎరువుల గోదాం ప్రారంభించారు. మన్నెగూడెంలో పల్లెదవాఖానా భవనం పనులకు భూమి పూజ చేశారు. అనంతరం కలెక్టర్ యాస్మిన్ బాషా మాట్లాడారు. జిల్లా విద్యార్థులు చదువులో రాణిస్తున్నారని ప్రశంసించారు. చిన్నప్పటి నుంచి కమ్యూనికేషన్ స్కిల్స్ పెంపొందించుకుంటే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని అన్నారు. ఇందుకోసం ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు మరింత బాధ్యత తీసుకోవాలని సూచించారు. ఎమ్మెల్యే రమేశ్‌బాబు మాట్లాడుతూ, మన్నెగూడేన్ని మండలం ప్రకటించడం కోసం ప్రజలతో కలిసి తాను కూడా పోరాడుతానన్నారు. కథలాపూర్, భీమారం మండలాల్లోని పలు గ్రామాలను కలిపి మన్నెగూడెం మండలంగా ఏర్పాటు చేసే అవకాశాలు ఉన్నాయని ఆయన స్పష్టం చేశారు. జెడ్పీ వైస్‌చైర్మన్ హరిచరణ్‌రావు, జెడ్పీ సీఈవో రామానుజాచారి, డీఈవో జగన్మోహన్‌రెడ్డి, పంచాయతీరాజ్ ఈఈ రహమాన్, ఎంపీపీ ఉమాదేవి, ఏఎంసీ చైర్‌పర్సన్ రమ్య, ఎంఈవో నరేశం, సర్పంచులు ఆదె హన్మక్క, అభిలాష్, నరేశ్‌రెడ్డి, వెంకటేశం, ఎంపీటీసీలు ఆదె రాజన్న, రవీందర్‌రావు పాల్గొన్నారు.

అసెంబ్లీ ఎన్నికలకు సిద్ధం





అవార్డులు అందజేస్తున్న ఎస్పీ భాస్కర్, సమావేశానికి హాజరైన పోలీసు అధికారులు

- బక్రీద్‌కు భద్రతా ఏర్పాట్లు చేయాలి
- పోలీసు అధికారులకు ఎస్పీ భాస్కర్ సూచన

జగిత్యాలక్రైం: వచ్చే అసెంబ్లీ ఎన్నికలకు పోలీసు అధికారులు సిద్ధంగా ఉండాలని ఎస్పీ భాస్కర్ సూచించారు. జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో పోలీసు అధికారులతో బక్రీద్ ఏర్పాట్లు, అసెంబ్లీ ఎన్నికల నిర్వహణకు అనుసరించాల్సిన వ్యూహాలపై మంగళవారం సమీక్షించారు. గతంలో నమోదైన సాధారణ, గ్రేవ్, నాన్ గ్రేవ్ కేసులు, దర్యాప్తు, విచారణ ప్రగతి గురించి ఆరా తీశారు. క్వాలిటీ ఆఫ్ ఇన్వెస్టిగేషన్, ప్లాన్ ఆఫ్ యాక్షన్ దర్యాప్తులో ఉండాలని, నేరస్తులకు చట్ట ప్రకారం శిక్ష పడేలా రికార్డుల నిర్వహణ, సాక్ష్యాధారాల సేకరణ ఉండాలని సూచించారు. సమస్యాత్మక గ్రామాలను విలేజ్ పోలీస్ ఆఫీసర్లు తరచూ సందర్శిస్తూ ప్రజలతో మమేకం కావాలని చెప్పారు. పోలింగ్ కేంద్రాలు, వాటి స్థితిగతులు, భౌగోళిక పరిస్థితుల గురించి తెలుసుకుని, పోలీసు భద్రతపై అంచనాకు రావాలని చెప్పారు. జిల్లా పరిధిలో చెక్ పోస్టులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. మండల కేంద్రాలు, గ్రామాల్లో సీసీ కెమెరాలు బిగించి, వాటిని నిరంతరం పర్యవేక్షించాలని చెప్పారు. అనంతరం తెలంగాణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా పోలీస్ శాఖ నిర్వహించిన సురక్ష దినోత్సవం, తెలంగాణ రన్‌ను విజయవంతం చేసిన అధికారులను ఎస్పీ అభినందించారు. డీఎస్పీలు ప్రకాశ్, రవీంద్రరెడ్డి, రవీంద్రకుమార్, సీఐలు శ్రీనివాస్, నటేశ్, లక్ష్మీనారాయణ, ఆరిఫ్‌అలీఖాన్, కోటేశ్వర్, ప్రవీణ్‌కుమార్, ఆర్ఐ వామనమూర్తి, ఎస్సైలు, ఐటీకోర్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మరుగుదొడ్ల ఎదుటే క్రీడాప్రాంగణం



మరుగుదొడ్ల ఎదుట బిగించిన క్రీడా పరికరాలు

రాయికల్(జగిత్యాల): క్రీడాకారుల సౌకర్యార్థం ప్రభుత్వం క్రీడాప్రాంగణాలు ఏర్పాటు చేస్తోంది. అయితే, స్థానిక కొత్తబస్టాండ్ మరుగుదొడ్ల వద్ద క్రీడా ప్రాంగణం ఏర్పాటు చేయడం ఆశ్చర్యానికి గురిచేస్తోంది. మరుగుదొడ్ల ఎదుటే క్రీడాపరికరాలు అమర్చి చేతులు దులుపుకోవడం మున్సిపల్ అధికారులు, కాంట్రాక్టర్ పనితీరుకు నిదర్శనంగా నిలుస్తోంది. కోరుట్ల నుంచి వచ్చే ఆర్టీసీ బస్సులు ఈ మార్గంలోనే వెళ్తుంటాయి. ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా ఏకంగా మరుగుదొడ్ల ఎదుట క్రీడాప్రాంగణం ఏర్పాటు చేయడంపై విమర్శలు వస్తున్నాయి. క్రీడాకారులు సాధన చేస్తుండగా.. దాని ఎదుటే ఉన్న మరుగుదొడ్లను ఎలా ఉపయోగించుకునేదని స్థానికులు.. ప్రధానంగా మహిళలు మండిపడుతున్నారు.

అద్భుతం.. ఆకర్షణీయం

- రెడీ అయిన కరీంనగర్ కేబుల్ బ్రిడ్జి
- నేడు ప్రారంభించనున్న మంత్రి కేటీఆర్
- అంతర్జాతీయ ప్రమాణాలతో తీగల వంతెన నిర్మాణం
- వెలుగులు విరజిమ్మనున్న డైనమిక్ లైటింగ్ సిస్టమ్
- ప్రతీ ఆదివారం వాహనాలకు నోఎంట్రీ
- నగరవాసుల ఉల్లాసం కోసమే : మంత్రి గంగుల కమలాకర్
- రేపటి నుంచి నిర్వహణ అంతా కార్పొరేషన్‌దే..



విద్యుత్ కాంతుల్లో మెరిసిపోతున్న కరీంనగర్‌లోని తీగల వంతెన

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: ఎప్పుడెప్పుడా అంటూ ఎదురుచూస్తున్న తీగల వంతెన ప్రారంభానికి సిద్ధమైంది. అంతర్జాతీయ ప్రమాణాలతో రూపుదిద్దుకున్న కేబుల్ బ్రిడ్జిని బుధవారం మున్సిపల్ మంత్రి కె.తారకరామారావు ప్రారంభించనున్నారు. సాయంత్రం నుంచి ఈ బ్రిడ్జిపై రాకపోకలకు అనుమతించనున్నారు. వాస్తవానికి గత ఏప్రిల్ 14న వంతెన ప్రారంభించాలి. కానీ.. పనులు పూర్తికాకపోవడం.. ఓ సభలో మంత్రి కాలికి గాయంకావడం తదితర కారణాలతో ప్రారంభోత్సవం వాయిదా పడుతూ వచ్చింది. తెలంగాణ దశాబ్ది వేడుకల వేళ.. పర్యాటకులకు అందుబాటులోకి తెచ్చేందుకు అధికారులు చర్యలు తీసుకున్నారు. ఈ క్రమంలో రెండురోజుల పాటు ప్రారంభోత్సవ వేడుకలు నిర్వహించాలని మంత్రి గంగుల కమలాకర్ నిర్ణయించారు.

నగరవాసుల కోసం..

జిల్లా పర్యాటకంలో కలికితురాయిగా నిలిచే కేబుల్ బ్రిడ్జిని తొలుత నగరవాసులకు పరిచయం చేయాలని మంత్రి గంగుల కమలాకర్, జిల్లా అధికారులు నిర్ణయించారు. స్థానికులు వంతెనపై అటూఇటూ సంచరించేందుకు వీలుగా ప్రతీ ఆదివారం సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 12 గంటల వరకు వాహనాలకు అనుమతి నిలిపివేశారు. పర్యాటకులను రంజింపజేసేలా మ్యాజిక్ షో, మ్యూజిక్ షో, కళాకారుల ఆటాపాటలు తదితర వినోద కార్యక్రమాల నిర్వహణకు ప్రణాళిక సిద్ధంచేశారు. రకరకాల ఫుడ్‌కోర్టులు ఏర్పాటుచేయనున్నారు. దాదాపు దసరా పండుగ వరకు కుటుంబాలతో వచ్చి సరదాగా గడిపేలా చర్యలు తీసుకుంటున్నారు. వంతెన వద్ద కొరియా సాంకేతికతతో రూ.8 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేస్తున్న డైనమిక్ లైటింగ్ సిస్టమ్ ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది.

నేపథ్యమిదీ..

వరంగల్ – కరీంనగర్ నగరాల మధ్య దాదాపు 7 కి.మీల దూరం తగ్గించడం, హైదరాబాద్–కరీంనగర్ రహదారిపై ట్రాఫిక్ నియంత్రణ కోసం ప్రభుత్వం కేబుల్ బ్రిడ్జి నిర్మాణానికి పూనుకుంది. 2018లో రూ.180 కోట్ల అంచనా బడ్జెట్‌తో పనులు ప్రారంభమయ్యాయి. హైదరాబాద్‌లోని దుర్గం చెరువు తీగల వంతెన తర్వాత తెలంగాణలో రెండో బ్రిడ్జి కరీంనగర్‌దే కావడం విశేషం. పూర్తిగా విదేశీ పరిజ్ఞానంతో నిర్మించిన వంతెన నాణ్యతను ఆర్ అండ్ బీ అధికారులు పలుమార్లు పరీక్షించారు.

రేపటి నుంచి కార్పొరేషన్ చేతుల్లోకి..

రోడ్లు, భవనాల శాఖ ఆధ్వర్యంలో రూపుదిద్దుకున్న తీగల వంతెన నిర్వహణ బాధ్యతలు గురువారం నుంచి మున్సిపల్ కార్పొరేషన్ ఆఫ్ కరీంనగర్(ఎంసీకే) చేతుల్లోకి వెళ్లనుంది. వంతెనపై లైటింగ్, పారిశుధ్యం నిర్వహణ, విద్యుత్ తదితరాలు ఇకపై బల్దియా చూసుకుంటుంది. రెండేళ్లపాటు వంతెనకు సంబంధించిన సాంకేతికపరమైన నిర్వహణను మాత్రం ఆర్ అండ్ బీ అధికారులు చూస్తారు. అంతేకాకుండా వంతెనపై రెండు భారీ పిల్లర్ల అంచున నాలుగు ఎల్ఈడీ తెరలు ఏర్పాటు చేయనున్నారు. వీటిపై ప్రభుత్వ, ప్రైవేటు ప్రకటనలు ప్రదర్శించనున్నారు.

> **పర్యాటక కేంద్రంగా..**
>
> 
>
> కరీంనగర్ జిల్లా కేంద్రాన్ని టూరిజం స్పాట్‌గా నిలపాలన్న సీఎం కేసీఆర్ ఆలోచనల్లో భాగంగానే తీగల వంతెన ఏర్పాటైంది. తెలంగాణ ఉద్యమ కాలం నుంచి ఆయనకు కరీంనగర్ మీద ఉన్న మమకారం అలాంటిది. రూ.180 కోట్ల వ్యయంతో కేబుల్ బ్రిడ్జి, రూ.410 కోట్లు వెచ్చించి మానేరు పరీవాహక ప్రాంతాన్ని సుందరంగా తీర్చిదిద్దేందుకు మానేరు రివర్ ఫ్రంట్(ఎంఆర్ఎఫ్) ప్రాజెక్టును మంజూరు చేశారు. – మంత్రి గంగుల కమలాకర్

వంతెన విశేషాలు..

- 500 మీటర్ల పొడవైన రోడ్డు, ఫోర్‌లేన్
- ఇటలీ నుంచి తెప్పించిన 26 పొడవైన స్టీల్ కేబుల్స్
- వంతనకు రెండు పైలాన్లు.. వీటి మధ్యదూరం 220 మీటర్లు
- పైలాన్ నుంచి ఇంటర్ మీడియన్‌కు దూరం 110 మీటర్లు
- రూ.180 కోట్ల బడ్జెట్.. పూర్తిగా అధునాతన ఇంజినీరింగ్ వ్యవస్థ
- రూ.8 కోట్లతో కొరియా డైనమిక్ లైటింగ్ సిస్టమ్
- వెడల్పు 21.5 మీటర్లు, ఒక్కోటి 7 మీటర్ల వెడల్పుతో రెండు దారులు
- రోడ్డుకు ఇరువైపులా 2.5 మీటర్ల వెడల్పుతో ఫుట్‌పాత్‌లు
- టాటా కంపెనీ సారథ్యంలో నిర్మాణం
- 2017 డిసెంబర్‌లో నిర్మాణానికి శంకుస్థాపన
- 2018 ఫిబ్రవరిలో పనులు ప్రారంభం
- 2023 జనవరి 26న వంతెనపై పనుల కోసం వాహనాలకు అనుమతి
- 2023 జూన్ 21న వంతెన ప్రారంభం

కేటీఆర్ పర్యటన ఇలా..

కేబుల్ బ్రిడ్జితోపాటు, వివిధ అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొనేందుకు వస్తున్న మున్సిపల్, ఐటీ మినిస్టర్ కె.తారకరామారావు బుధవారం సాయంత్రం 5 గంటలకు రూ.10 కోట్లతో కశ్మీర్ గడ్డలో నిర్మించనున్న ఇంటిగ్రేటెడ్ మార్కెట్, 5.05 గంటలకు రూ.7 కోట్లు వెచ్చించి నిర్మించనున్న డిజిటల్ లైబ్రరీ పనులకు శంకుస్థాపన చేయనున్నారు. రూ.2 కోట్ల వ్యయంతో సిటిజన్ సర్వీస్ సెంటర్ ప్రారంభించనున్నారు. సాయంత్రం 5.15 గంటలకు ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్, ఐసీసీ వీడియో వాల్ కంట్రోల్ రూం, 14 జంక్షన్ల ఆటోమేటెడ్ ట్రాఫిక్ కంట్రోల్ సిస్టం(ఏటీసీఎస్), 18 చోట్ల ఏర్పాటు చేసిన పబ్లిక్ అడ్రసింగ్ సిస్టం(పీఏఎస్), 8 చోట్ల వేరియబుల్ మెసేజింగ్ సిస్టం, ఐదుచోట్ల వాతావరణ సూచికలు, 18 ప్రాంతాల్లో వైఫై హాట్‌స్పాట్లు, ఘన వ్యర్థాల నిర్వహణను మంత్రి ప్రారంభిస్తారు. సాయంత్రం 6 గంటలకు కమాన్ మీదుగా ఓపెన్‌టాప్ జీపులో ర్యాలీగా వెళ్లి కేబుల్ బ్రిడ్జి ప్రారంభిస్తారు. అనంతరం ఏర్పాటు చేసిన డైనమిక్ లైటింగ్ సిస్టమ్‌కు మంత్రి కేటీఆర్ స్విచ్ఛాన్ చేయనున్నారు.



క్లుప్తంగా

సెలూన్, పంక్చర్ షాపు దగ్ధం


దగ్ధమవుతున్న సెలూన్

జగిత్యాల క్రైం: జగిత్యాల రూరల్ మండలంలోని చల్‌గల్ బస్టాండ్ వద్ద గొల్లపల్లి అంజయ్యగౌడ్, వెయ్యిగండ్ల నవీన్‌లకు చెందిన సెలూన్, పంక్చర్‌షాపు మంగళవారం మధ్యాహ్నం ప్రమాదవశాత్తు దగ్ధమయ్యాయి. స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో వచ్చి, మంటలను ఆర్పివేశారు.

బాధితులను ఆదుకుంటాం : ఎమ్మెల్యే

జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. అంజయ్య, నవీన్‌లను ప్రభుత్వపరంగా ఆదుకుంటామన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

కమాన్‌పూర్(మంథని): రామగిరి మండలంలోని రాజాపూర్‌కు చెందిన ఎడ్ల బాపు(44) ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బాపు వ్యవసాయ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. కొన్ని నెలలుగా మద్యానికి బానిసయ్యాడు. మంగళవారం మద్యం మత్తులో ఇంటికి వచ్చి, పక్కనే ఉన్న ఎడ్ల కొట్టంలోకి వెళ్లి, ఉరేసుకున్నాడు. మృతుడికి భార్య, ఒక కుమారుడు ఉన్నారు. కుమారుడు అంజిత్ కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రవి ప్రసాద్ పేర్కొన్నారు.

కాన్పూర్‌లో దుర్శేడ్‌వాసి..

కరీంనగర్‌రూరల్: ఉపాధి నిమిత్తం ఉత్తరప్రదేశ్‌లోని కాన్పూర్‌కు వెళ్లిన కరీంనగర్ మండలం దుర్శేడ్‌కు చెందిన నాగారపు రాజు(37) ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య చేసుకున్నాడు. గ్రామస్తుల కథనం ప్రకారం కొన్నేళ్లనుంచి రాజు కాన్పూర్‌లో జ్యోతిష్యం చెప్పుతూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. రెండు నెలలక్రితం దుర్శేడ్‌కు వచ్చి మళ్లీ కాన్పూర్‌కు వెళ్లాడు. జ్యోతిష్యంపై పెద్దగా ఆదాయం రాకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు తలెత్తాయి. ఈ క్రమంలోనే మనస్తాపానికి గురైన రాజు సోమవారం ఉరేసుకున్నాడు. కుటుంబసభ్యులు ఎంపీ బండి సంజయ్‌ని కలిసి మృతదేహాన్ని తీసుకవచ్చేందుకు చర్యలు చేపట్టాలని కోరారు. కాన్పూర్‌లోని అధికారులతో ఎంపీ సంజయ్ మాట్లాడగా మంగళవారం రాజు మృతదేహాన్ని అంబులెన్స్‌లో దుర్శేడ్‌కు పంపించారు. సాయంత్రం అంత్యక్రియలు నిర్వహించారు. మృతుడికి భార్య మల్లీశ్వరి, కుమారులు శివాజీ, సాయి కల్యాణ్, కుమార్తె వరలక్ష్మి ఉన్నారు.

రెండు బైక్‌లు ఢీకొని ఇద్దరికి గాయాలు

జగిత్యాల క్రైం: జిల్లా కేంద్రంలోని అంగడి బజార్ వద్ద మంగళవారం రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో ఇద్దరికి గాయాలయ్యాయి. బాధితులను స్థానికులు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

లారీని ఢీకొన్న బైక్

- యువకుడికి తీవ్ర గాయాలు

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి పట్టణంలోని నల్ల పోచమ్మ వాడకు చెందిన ఎండీ.వాహబ్ మంగళవారం బైక్‌పై వెళ్తూ రంగంపల్లి వద్ద ఓ లారీని ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో అతనికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. ప్రథమ చికిత్స అనంతరం కుటుంబసభ్యులు మెరుగైన వైద్యం కోసం వాహబ్‌ను కరీంనగర్ తరలించారు.

విద్యాసంస్థల బస్సులకు.. ఫిట్‌నెస్ తప్పనిసరి

- నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టరీత్యా చర్యలు
- జిల్లాలో స్కూళ్లు, కళాశాలల బస్సులు 647

జగిత్యాల క్రైం: పాఠశాలలు పునఃప్రారంభమయ్యాయి. ప్రైవేటు స్కూల్ విద్యార్థులను బస్సుల్లో ఇంటి నుంచి తీసుకెళ్లి, తిరిగి సాయంత్రం చేరుస్తుంటారు. వాటి ఫిట్‌నెస్‌ను ఎప్పటికప్పుడు పాఠశాలల యాజమాన్యాలు పర్యవేక్షించాలి. జగిత్యాల జిల్లాలో 647 పాఠశాలలు, కళాశాలల బస్సులు ఉండగా, ఇప్పటి వరకు 228 వాహనాలకే ఫిట్‌నెస్ పరీక్షలు నిర్వహించారు. మరో 121 బస్సులకు 15 ఏళ్ల కాలపరిమితి ముగియడంతో ఫిట్‌నెస్ చెక్ చేసేందుకు రవాణా శాఖ అధికారులు నిరాకరించారు. మరో 161 బస్సులను యజమానులు పరీక్షలకు తీసుకురావాల్సి ఉంది.

సీజ్ చేస్తామంటున్న అధికారులు

జగిత్యాల రూరల్ మండలంలోని తాటిపల్లిలో గల జిల్లా రవాణా శాఖ కార్యాలయంలో ఫిట్‌నెస్ పరీక్షలు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. గతేడాదికి సంబంధించి ప్రైవేటు విద్యాసంస్థల బస్సుల ఫిట్‌నెస్ గడువు ముగిసిందన్నారు. ఫిట్‌నెస్ ఉంటేనే బస్సులను రోడ్లపై తిప్పాలని, నిబంధనలు అతిక్రమిస్తే సీజ్ చేస్తామని హెచ్చరిస్తున్నారు.

పాటించాల్సిన నిబంధనలివే..

- బస్సులు 15 ఏళ్ల కాలపరిమితి దాటకూడదు.
- బస్సులు పసుపు రంగులోనే ఉండాలి.
- డ్రైవర్ వయసు 60 ఏళ్లలోపు, హెవీ వెహికిల్ లైసెన్స్, ఐదేళ్ల అనుభవం ఉండాలి.
- బస్సుపై కుడి, ఎడమ వైపు పాఠశాల పేరు, చిరునామా స్పష్టంగా రాయాలి.
- వాహనం ఆగితే బ్లింక్ అయ్యేలా పైభాగంలో నాలుగు వైపులా అంబర్ లైట్లు ఉండాలి.
- డ్రైవర్ లైసెన్సును పాఠశాల యాజమాన్యం ఆర్టీఏ కార్యాలయంలో అందించాలి.


బస్సులకు ఫిట్‌నెస్ పరీక్షలు చేస్తున్న ఆర్టీఏ అధికారులు

- బస్సులో ప్రథమ చికిత్స పెట్టె, మంటలను ఆర్పే వ్యవస్థ ఉండాలి.
- కిటికీలకు అడ్డంగా మూడు కడ్డీలు ఉండాలి.
- నేల నుంచి 325 మి.మీ .ఎత్తులో మెట్లు, ఎక్కేందుకు హ్యాండ్ రెయిలింగ్ ఉండాలి.
- అత్యవసర ద్వారం, బస్సు డ్రైవర్, అటెండర్ ఫోన్ నంబర్లు ఉండాలి.
- నెలకోసారి డ్రైవర్‌కు బీపీ, షుగర్, కంటి పరీక్షలు చేయించాలి.
- టీఎస్ స్కూల్ యాప్‌లో విద్యాసంస్థ, డ్రైవర్, అటెండర్ పేరు వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి.

కాలం చెల్లిన బస్సులు తిప్పొద్దు



పాఠశాలలు, కళాశాలల యజమానులు నిబంధనలు పాటించాలి. బస్సులకు విధిగా ఫిట్‌నెస్ పరీక్షలు చేయించాలి. ఫిట్‌నెస్ లేని, కాలం చెల్లిన బస్సులను రోడ్లపై తిప్పితే చట్టరీత్యా చర్యలు తీసుకుంటాం. – శ్యామ్‌నాయక్, జిల్లా రవాణా శాఖ అధికారి

నాలుగు బస్సులు సీజ్

అనుమతి లేకుండా రోడ్లపై బస్సులు తిప్పితే చర్యలు తప్పవని ఎంవీఐలు వంశీధర్, వెంకటరమణ హెచ్చరించారు. మంగళవారం జగిత్యాల జిల్లా కేంద్రంలోని ఎస్‌కేఎన్‌ఆర్ డిగ్రీ కళాశాల, గొల్లపల్లి బైపాస్‌రోడ్‌లో స్కూల్ బస్సులపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. 35 బస్సులను తనిఖీ చేసి, నిబంధనలు పాటించని నాలుగింటిని సీజ్ చేశారు. ప్రతీ వాహనానికి ఫిట్‌నెస్, ఇన్సూరెన్స్ ఉండాలన్నారు. ట్యాక్స్ చెల్లించని వాహనాలనూ రోడ్లపై తిప్పవద్దని పేర్కొన్నారు.


వాహనాల ధ్రువపత్రాలు పరిశీలిస్తున్న ఎంవీఐలు

గ్రంథాలయాలతో అనేక ప్రయోజనాలు


గ్రంథాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, జెడ్పీ చైర్‌పర్సన్ వసంత

- యువత సద్వినియోగం చేసుకోవాలి
- ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత

జగిత్యాలరూరల్: గ్రంథాలయాలు యువతకు ఎంతో ఉపయోగపడుతున్నాయని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత అన్నారు. జగిత్యాల రూరల్ మండలం చల్‌గల్ గ్రామంలో మంగళవారం వారు మినీ గ్రంథాలయన్ని ప్రారంభించి మాట్లాడారు. గ్రామాల్లో గ్రంథాలయాలు అందుబాటులోకి వస్తే.. పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే యువత మేథాశక్తిని పెంపొందించుకోవచ్చన్నారు. అనంతరం చల్‌గల్ గ్రామంలోని పల్లెదవాఖానాను పరిశీలించారు. వైద్యులు ఆలస్యంగా విధులకు రావడంతో అసంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం చల్‌గల్ జిల్లా పరిషత్ పాఠశాలలో పదో తరగతిలో 9.8 జీపీఏ సాధించిన సానియాను సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రశేఖర్‌గౌడ్, సర్పంచ్ ఎల్ల గంగనర్సు, సింగిల్‌విండో చైర్మన్ మహిపాల్‌రెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ ఆసీఫ్, రైతుబంధు సమితి మండల కన్వీనర్ నక్కల రవీందర్‌రెడ్డి, ఎంపీడీవో రాజేశ్వరి, ఎంపీవో రవిబాబు పాల్గొన్నారు.

ఈత, తాటివనం పరిశీలన

ఇటీవల ప్రమాదవశాత్తు అగ్నిప్రమాదంలో కాలిపోయిన ఈత, తాటివనంలో ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, జెడ్పీచైర్‌పర్సన్ దావ వసంత పర్యటించారు. ఘటనకు దారితీసిన పరిస్థితుల గురించి గీతకార్మికులను అడిగి తెలుసుకున్నారు. గౌడ సంఘం భవన నిర్మాణానికి జిల్లా పరిషత్ నుంచి రెండు బోరుమోటార్ల ఏర్పాటుకు నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. గౌడ సంఘం భవన నిర్మాణానికి రూ.4 లక్షల మంజూరు ప్రొసీడింగ్స్ అందజేశారు.

నవసమాజ నిర్మాతలు ఉపాధ్యాయులే..

జగిత్యాల: నవసమాజ నిర్మాతలు ఉపాధ్యాయులేనని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. స్థానిక పద్మనాయక కల్యాణ మండపంలో తెలంగాణ విద్యా దినోత్సవం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ, మన ఊరు.. మన బడి ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పిస్తున్నామన్నారు. జిల్లాలో రూ.116 కోట్ల వ్యయంతో 274 పాఠశాలల్లో తొలిదశలో పనులు చేపట్టామని తెలిపారు. జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత మాట్లాడుతూ, ఉపాధ్యాయులే సమాజానికి ఆయువు పట్టన్నారు. కలెక్టర్ యాస్మిన్ బాషా మాట్లాడుతూ, ప్రభుత్వం విద్యకు ప్రాధాన్యం ఇస్తోందన్నారు. అదనపు కలెక్టర్ మకరంద్, డీఈవో జగన్మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

విద్యారంగంలో ముందంజ


పాఠశాలను ప్రారంభిస్తున్న మంత్రి కొప్పుల ఈశ్వర్

- ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు
- విద్యాదినోత్సవంలో సంక్షేమశాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్

ధర్మపురి: ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు మెరుగైన ఫలితాలు సాధిస్తున్నాయని, అందుకు మన ఊరు.. మన బడి కార్యక్రమమే నిదర్శనమని సంక్షేమశాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. మన ఊరు.. మన బడి ద్వారా అభివృద్ధి పనులు పూర్తిచేసిన దోనూర్ ప్రభుత్వ పాఠశాలను మంగళవారం మంత్రి ప్రారంభించారు. మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించిన ప్రధానోపాధ్యాయుడు కాశెట్టి రమేశ్‌ను అభినందించారు. నియోజకవర్గంలో 91 పాఠశాలలు మన ఊరు.. మన బడి కింద ఎంపికయ్యాయని, ధర్మపురి మండలంలో 18 స్కూళ్లు ఉన్నాయన్నారు. దోనూర్, జైనా బడుల్లో పనులు పూర్తికావడంతో విద్యా దినోత్సవం సందర్భంగా ప్రారంభించామని చెప్పారు. పేద విద్యార్థుల సంక్షేమం కోసమే ప్రభుత్వం ఈ పథకం అమలు చేస్తోందని అన్నారు. ఈకార్యక్రమంలో ఎంపీపీ చిట్టిబాబు, జెడ్పీటీసీ బత్తిని అరుణ, ఏఎంసీ చైర్మన్ అయ్యోరి రాజేశ్, సర్పంచ్ సువర్ణ, ప్రధానోపాధ్యాయుడు కాశెట్టి రమేశ్ పాల్గొన్నారు.

పుస్తక పఠనంతో విజ్ఞానం

గొల్లపల్లి(ధర్మపురి): పుస్తక పఠనంతో విజ్ఞానం పెంపొందుతుందని మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా రాఘవపట్నం గ్రామపంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పబ్లిక్ రీడింగ్ రూమ్‌ను మంత్రి ప్రారంభించి మాట్లాడారు. దీనిని ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అడిషనల్ కలెక్టర్ మకరంద్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రశేఖర్‌గౌడ్, ఎంపీపీ నక్క శంకర్, జెడ్పీటీసీ గోస్కుల జలేందర్ పాల్గొన్నారు.

ధ్రువపత్రాల కోసం రాత్రి వరకు నిరీక్షణ


తహసీల్దార్ కార్యాలయంలో నిరీక్షిస్తున్న దరఖాస్తుదారులు

ధర్మపురి: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన రూ.లక్ష ఆర్థికసాయం పథకానికి దరఖాస్తు చేసుకునేందుకు ధ్రువపత్రాల కోసం ప్రజలు మంగళవారం రాత్రి వరకు ధర్మపురి తహసీల్దార్ కార్యాలయంలో నిరీక్షించారు. ఆన్‌లైన్ సమస్య సాకుతో అధికారులు, మీసేవ కేంద్రాల నిర్వాహకులు చేతులెత్తేయడంతో వారు తీవ్ర నిరాశ చెందారు. ఆదాయం, కుల ధ్రువీకరణ పత్రాల కోసం రోజుల తరబడి తిరిగినా ఫలితం దక్కలేదని ఆవేదన వ్యక్తం చేశారు. 6 వేలకు పైగా దరఖాస్తులు కుప్పలుతెప్పలుగా కార్యాలయంలో పడి ఉన్నాయి. ఆర్థికసాయం పథకానికి దరఖాస్తు చేసుకునేందుకు మంగళవారమే చివరి తేదీ కావడంతో ప్రజలు ఉదయం నుంచి రాత్రి వరకు తహసీల్దార్ ఆఫీస్ వద్ద కనిపించారు.

సోషల్ మీడియాలో పోస్టుపై అప్రమత్తం

- మన్నెగూడెంలో వేములవాడ ఎమ్మెల్యే, జెడ్పీ చైర్‌పర్సన్ పర్యటనకు పోలీసుల బందోబస్తు

కథలాపూర్: భీమారం మండలంలోని మన్నెగూడెంలో మంగళవారం వేములవాడ ఎమ్మెల్యే రమేశ్ బాబు, జెడ్పీ చైర్‌పర్సన్ వసంత పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొనేందుకు వచ్చారు. ఈ సందర్భంగా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. మన్నెగూడెంను మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలని, ప్రజాప్రతినిధులు హామీ ఇచ్చి పట్టించుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేస్తూ సోషల్ మీడియాలో పలువురు గ్రామస్తులు పోస్టు చేశారు. దీంతో అప్రమత్తమైన కోరుట్ల సీఐ ప్రవీణ్‌కుమార్, మేడిపెల్లి ఎస్సై చిరంజీవి, జగిత్యాల ఎస్సై సుధీర్‌రావులు 25 మంది పోలీస్ సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు. గ్రామంలో కొత్తగా నిర్మించిన జీపీ భవనాన్ని ఎమ్మెల్యే, జెడ్పీ చైర్‌పర్సన్ ప్రారంభించారు. పల్లె దవాఖానా భవనం పనులకు భూమిపూజ చేశారు. అనంతరం సమావేశం ఏర్పాటు చేయగా గొడవ చేయాలని చూసిన వారి వద్దకు పోలీసులు వెళ్లి, వారించారు. కార్యక్రమం ప్రశాంతంగా ముగియడంతో పోలీస్ అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.


కొత్త జీపీ భవనం వద్ద పోలీసుల బందోబస్తు

కల్లు దుకాణంపై దాడి

జ్యోతినగర్(రామగుండం): కల్లు దుకాణంపై కొంత మంది యువకులు దాడికి పాల్పడిన ఘటన ఎన్టీపీసీ ఠాణా పరిధి నర్రాశాలపల్లెలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. గ్రామంలో పొన్నం గౌరయ్య గౌడ్ కల్లు దుకాణం నిర్వహిస్తున్నాడు. మంగళవారం కల్లు విక్రయిస్తుండగా కొంతమంది యువకులు వచ్చి, సీసాల్లో ఉన్న కల్లు పారబోశారు. వాటిని పగులగొట్టి, దాడి చేశారని బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. గౌరయ్య గౌడ్ గీత వృత్తి చేసుకుంటూ ఇంటి వద్ద కల్లు అమ్ముతుంటాడని స్థానికులు తెలిపారు. కల్లు కోసం వచ్చి గొడవ చేయడం, దాడికి పాల్పడటాన్ని తెలంగాణ గౌడ సంఘం జిల్లా కమిటీ నాయకులు ఖండించారు. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు.

రైతుకు రొక్కం

జిల్లాకు 'రైతుబంధు' నిధులు మంజూరు



- 2.31 లక్షల మంది రైతులకు రూ.211.41 కోట్లు
- 26 నుంచి వ్యక్తిగత బ్యాంకు ఖాతాల్లో జమ
- ఏర్పాట్లు పూర్తి చేసిన వ్యవసాయ అధికారులు

జగిత్యాలఅగ్రికల్చర్: జిల్లా రైతులకు వానాకాలం పెట్టుబడి సాయం అందించేందుకు రాష్ట్రప్రభుత్వం రైతుబంధు పథకం కింద రూ.211.41 కోట్లు కేటాయించింది. ఎకరాకు రూ.5వేల చొప్పున వారి వ్యక్తిగత బ్యాంకు ఖాతాల్లో ఈనెల 26నుంచి జమ చేస్తామని వెల్లడించింది. ఈమేరకు జిల్లా వ్యవసాయ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

వివరాలు ఇవ్వనివారు ఏఈవోలకు ఇవ్వాలి..

- ఈ వానాకాలం పెట్టుబడి సాయం కోసం జిల్లాలో 2,31,151 మంది రైతులు ఇప్పటివరకు అర్హత సాధించారు.
- వీరి వివరాలతో కూడిన జాబితాను జిల్లా వ్యవసాయ శాఖ ఇప్పటికే ప్రభుత్వానికి పంపించింది.
- దీనికితోడు, ఐదారు నెలల్లో కొత్తగా పట్టాదారు పాస్ పుస్తకాలు పొందినవారు, వివిధ కారణాలతో రైతుబంధు అందని వారు, తమ పూర్తివివరాలతో ఏఈవోలకు అందజేయాలని అధికారులు సూచిస్తున్నారు.
- వీరితోపాటు కొత్త రైతుల వివరాలనూ రాష్ట్రస్థాయి అధికారులకు పంపించారు.
- ప్రస్తుతం జిల్లా వ్యవసాయ శాఖ వద్ద రైతుబంధు పెండింగ్ దరఖాస్తులు ఏమీ లేవు.
- అయినా, ఎవరైనా అర్హులైన రైతులు ఉంటే ఇంకా దరఖాస్తు చేసుకునే వెసులుబాటు ఉంది.

పెట్టుబడికి ఉపయోగం



రైతుబంధు డబ్బులు రైతులను ఆపదలో ఆదుకుంటున్నాయి. వానాకాలం సీజన్ ఖర్చుల కోసం ఇవి ఉపయోగపడతాయి. కూలీలు, రసాయన ఎరువుల ఖర్చులు విపరీతంగా పెరిగాయి. పెరిగిన పెట్టుబడి కోసం రైతుబంధు డబ్బులు ఆదుకుంటున్నాయి. ఇతరులను అప్పు అడిగే బాధ రైతులకు తప్పుతుంది.

– నక్కల రవీందర్‌రెడ్డి, రైతుబంధు మండల కన్వీనర్

అర్హుల జాబితా పంపించాం



వానాకాలం సీజన్‌లో అందించే రైతుబంధు పథకానికి అర్హులైన వారి జాబితాను ఇప్పటికే ప్రభుత్వానికి పంపించాం. సుమారు 2.31 లక్షల మంది రైతులకు రూ.211.41 కోట్ల వరకు పెట్టుబడి సాయం అందుతుంది. కొత్తగా పట్టాదారు పాసు పుస్తకాలు పొందిన రైతులు, బ్యాంకు వివరాలను ఎప్పటికప్పుడు పంపిస్తున్నాం. రైతుబంధు రానివారు ఇంకా దరఖాస్తు చేసుకోవచ్చు.

– సురేశ్‌కుమార్, జిల్లా వ్యవసాయాధికారి

తొలుత ఎకరం లోపు..

రైతుబంధు కింద జిల్లాలోని అర్హులైన రైతులకు తమ వ్యక్తిగత బ్యాంకు ఖాతాల్లో రూ.211,41,06,460 జమచేసేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. రైతుబంధు పథకాన్ని 2018లో ప్రభుత్వం ప్రారంభించింది. అప్పుడు జిల్లాలో 1,91,459 మంది రైతులు రూ.164.47 కోట్లను పెట్టుబడి సాయంగా పొందారు. భూ రికార్డులను సరిచేసుకోవడం, బ్యాంకు ఖాతా వివరాలు సరిగ్గా అందించడం వంటివి క్లియర్ చేసుకోవడంతో గత యాసంగి నాటికి రైతుల సంఖ్య 2.31 లక్షలకు చేరింది. వారికి అందే రైతుబంధు కూడా రూ.211.41 కోట్లకు చేరింది. దీంతో ఈ వానాకాలం సీజన్‌లోనూ అంతేమొత్తంలో సొమ్ము రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తారు. తొలుత ఒక ఎకరం లోపు వారికి, తర్వాత రెండు ఎకరాలు.. ఇలా ఎకరాల వారీగా రైతు బంధు సాయం జమచేస్తామని అధికారులు వివరించారు.

ప్రచార అస్త్రంగా 'దళితబంధు'

- ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

జగిత్యాలటౌన్: బీఆర్ఎస్ ప్రభుత్వం తన వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే దశాబ్ది ఉత్సవాల పేరిట కొత్త డ్రామాకు తెరతీసిందని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి విమర్శించారు. స్థానిక ఇందిరాభవన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జనాభా ప్రాతిపదికన దళితులకు నిధులు కేటాయించడం రాజ్యాంగం ప్రసాదించిన హక్కు అన్నారు. అయినా, ఏటా బడ్జెట్‌లో కేటాయించిన నిధులను ఖర్చుచేయకుండా క్యారీఫార్వర్డ్ చేస్తూ సీఎం కేసీఆర్ దళితులను మభ్యపెడుతున్నారని ధ్వజమెత్తారు. 90శాతం మంది బీసీ కులాలను విస్మరించి, అందులోని కేవలం పదిశాతం బీసీ కులాలకు లబ్ధి చేకూర్చేలా రూ.లక్ష ఆర్థిక సాయం ప్రకటించారని అన్నారు. ప్రభుత్వ యాజమాన్యంలో రైస్‌మిల్లులు ఏర్పాటు చేస్తామన్న ప్రకటన హాస్యాస్పదమన్నారు. తొలుత వ్యవసాయధారిత ముత్యంపేట షుగర్ ఫ్యాక్టరీ తెరిపించాలని డిమాండ్ చేశారు. ఇథనాల్ ఫ్యాక్టరీతో కాలుష్యం వెలువడుతుందని నిరూపిస్తే ముక్కునేలకు రాస్తానని మంత్రి ఈశ్వర్ అంటున్నారని, రాబోయే ఎన్నికల్లో మంత్రిని ముక్కు నేలకు రాయించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని అన్నారు. మంత్రి ప్రకటన వాస్తవమే అయితే ఇథనాల్ 'ముద్దు.. షుగర్ ఫ్యాక్టరీ వద్దు' నినాదంతో వచ్చే ఎన్నికల్లో ప్రచారం చేయాలని సవాల్ విసిరారు. ప్రభుత్వం చెప్పుకుంటున్న 24 గంటల విద్యుత్ సరఫరా నిజమని నిరూపిస్తే తాను రాబోయే ఎన్నికల్లో పోటీచేయబోనని జీవన్‌రెడ్డి స్పష్టం చేశారు. ఈనెల 22న కాంగ్రెస్ చేపట్టే దశాబ్ది దగాను విజయవంతం చేయాలని ఆయన కోరారు. నాయకులు గిరి నాగభూషణం, కల్లెపెల్లి దుర్గయ్య, గాజుల రాజేందర్, బండ శంకర్, చందా రాధాకిషన్, గుండ మధు, మున్నా తదితరులు పాల్గొన్నారు.


కల్లు రుచి చూస్తున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

కల్లు రుచి చూసిన ఎమ్మెల్సీ..

జగిత్యాలరూరల్: ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి కల్లు రుచిచూశారు. చల్‌గల్‌లోని ఈత, తాటివనంలో పైప్‌లైన్, బోరుబావి నిర్మాణానికి రూ.5 లక్షలు మంజూరు చేసిన జీవన్‌రెడ్డి.. వాటి పనులకు భూమిపూజ చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. గీత కార్మికులకు ఎల్లవేళలా అండగా ఉంటానని అభయం ఇచ్చారు. కార్యక్రమంలో గౌడ సంఘం అధ్యక్షుడు ముక్కెర మారుతి, సభ్యులు నేరెళ్ల ఎల్లాగౌడ్, గాజర్ల శంకర్, అంజన్న, బుచ్చన్న, మల్లేశం, మల్లయ్య, మనోజ్, నందన్న, నాయకుడు జున్ను రాజేందర్ పాల్గొన్నారు.

'తెలంగాణలో వచ్చేది బీజేపీ ప్రభుత్వమే'

జగిత్యాలటౌన్: రాబోయే రోజుల్లో తెలంగాణ రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రాబోతోందని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు భోగ శ్రావణి జోస్యం చెప్పారు. మంగళవారం స్థానిక మంచినీళ్లబావి ప్రాంతానికి చెందిన పలువురు మహిళలు బీజేపీలో చేరారు. భోగ శ్రావణి వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. శ్రావణి మాట్లాడుతూ దేశంలో మోదీ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులవుతున్న ప్రజలు బీజేపీలో చేరుతున్నారన్నారు. జగిత్యాలలో తమ పార్టీకి పెరుగుతున్న ఆదరణకు ఇదే నిదర్శనమని పేర్కొన్నారు. రాబోయే ఎన్నికల్లో రాష్ట్రంతోపాటు జగిత్యాల బల్దియాలో బీజేపీ జెండా ఎగరడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు వీరబత్తిని అనిల్, నాయకులు సిరికొండ రాజన్న, మెరుగు ఉమేశ్, నక్క జీవన్ తదితరులు ఉన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

WANTED

■ మా యొక్క ప్రముఖ సంస్థకు మొబైల్ ద్వారా సమాచారం పంపుతూ అధిక ఆదాయం సంపాదించుకోండి. మీ అడ్రస్ వాట్సాప్ చేయండి. వివరాలకు కాల్ చేయండి. 95736 33520, 90596 33520. [M-1221321]

■ హైదరాబాద్ ఏరియాలో పనిచేయడానికి హెల్పర్స్, ప్యాకింగ్ బాయ్స్ కావలెను. చదువు లేకున్నా జాబ్. జీతం: 18 నుండి 20 వేలు వసతి కలదు. Ph: 8096309212 [H-781385]

■ త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను, ఉచిత వసతి+భోజనం, జీ: 18K ఏజెంట్స్ కమీషన్ 3K ఫోన్ : 9848571888 [H-793449]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classifieds, Advertisements Contact:
9951602933
9951602824